సాక్షి
కాకినాడ

శుక్రవారం I 5 I జనవరి I 2024



రూ.1,00,116 విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవనానికి వైట్ల అనిల్ కృష్ణ చౌదరి, నవ్య దంపతులు (ఆలమూరు) గురువారం రూ.1,00,116 విరాళం సమర్పించారు.



కొక్కొరొక్కో.. రక్షణ ఇదిగో...

శీతాకాలంలో కోళ్లకు ఎక్కువగా వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వీటి గురించి తెలుసుకుని మేలుకోకపోతే నష్టాలు తప్పవని అధికార యంత్రాంగం సూచిస్తోంది. - 8లో▸

10,700 క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు గురువారం 10,700 క్యూసెక్కుల గోదావరి నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,150, మధ్య డెల్టాకు 2,050, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.05 అడుగులుగా ఉంది.

న్యూస్‌రీల్

జిల్లాకు వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రాడక్ట్ అవార్డు



కలెక్టర్ కృతికా శుక్లాకు అవార్డును అందజేస్తున్న జౌళి శాఖ అధికారులు

కాకినాడ సిటీ: భారత ప్రభుత్వం 2023 సంవత్సరానికి ప్రతిష్ఠాత్మక వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రాడక్ట్ జాతీయ అవార్డులను ప్రకటించింది. ఇందులో వ్యవసాయేతర విభాగం కింద ఉప్పాడ జాంధానీ చీరల ఉత్పత్తులకు సంబంధించి జిల్లాకు గోల్డ్ అవార్డు లభించింది. ఈ నెల 3న ఢిల్లీలోని భారత మండపంలో ఆత్మ నిర్భర్ భారత్ ఉత్సవ్–2024 వేడుకల్లో కేంద్ర విదేశాంగ మంత్రి సుబ్రమణ్యం జయశంకర్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా జిల్లాకు ఈ అవార్డు ప్రదానం చేశారు. కలెక్టర్ తరఫున జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి కూరెళ్ల పెద్దిరాజు ఈ అవార్డు అందుకున్నారు. వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రాడక్ట్ అవార్డులకు జాతీయ స్థాయిలో మొత్తం 560 దరఖాస్తులు నమోదయ్యాయి. వీటిలో 64 మాత్రమే నామినేట్ కాగా, వివిధ రాష్ట్రాలకు చెందిన 16 ఉత్పత్తులు జాతీయ అవార్డులు అందుకున్నాయి. జిల్లాకు లభించిన ఈ అవార్డును జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి పెద్దిరాజు కలెక్టర్ కృతికా శుక్లాకు గురువారం అందజేశారు. ఈ అవార్డుపై కలెక్టర్ ఆనందం వ్యక్తం చేశారు. దీని ద్వారా ఉప్పాడ జాంధానీ చీరలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం లభిస్తుందన్నారు. ఇందుకు అనుగుణంగా జాంధానీ చీరల ఉత్పాదనను పెంచేందుకు, చేనేత కార్మికుల ఆర్థిక వికాసానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని చేనేత, జౌళి శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు.

పెద్దాపురంలో రేపు సామాజిక సాధికార బస్సు యాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: వైఎస్సార్ సీపీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సు యాత్ర శనివారం పెద్దాపురంలో జరగనుంది. ఈ నేపథ్యంలో నియోజకవర్గ నాయకులతో సామర్లకోటలోని తన క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు గురువారం సమావేశమయ్యారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని దృష్టిలో ఉంచుకుని ఈ యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కుటుంబం నుంచి కనీసం ఒకరు తప్పనిసరిగా వచ్చేలా చూడాలని దొరబాబు సూచించారు. సమావేశంలో ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు ఆవాల లక్ష్మీనారాయణ, కంటే వీరరాఘవరావు, పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, రెండు మున్సిపాలిటీల కౌన్సిలర్లు, రెండు మండలాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూ చిక్కులకు చెక్

భూమి చుట్టూ హద్దు రాళ్లు పాతారు



కరప మండలం వాకాడ గ్రామానికి చెందిన ఈ రైతు పేరు వాసంశెట్టి ఈశ్వరరావు. ఈయనకు 1.60 ఎకరాల భూమి ఉంది. ఇటీవల జరిగిన రీ సర్వే ద్వారా ప్రభుత్వ సిబ్బంది ఈ రైతు పొలాన్ని కొలిచి, భూమి చుట్టూ సరిహద్దు రాళ్లు వేశారు. శాశ్వత భూ హక్కు పత్రం అందజేశారు. ఇందులో క్యూఆర్ కోడ్, మ్యాపుల ఫొటోలు, విస్తీర్ణం, సర్వే నంబర్లతో సహా అన్ని వివరాలూ ముద్రించారు. ఇలా తన భూమికి అన్ని ఆధారాలతో కూడిన పత్రాలను అందించడం, భూమి విస్తీర్ణాన్ని తెలియజేస్తూ సర్వే రాళ్లు పాతడం చాలా ఆనందంగా ఉందని ఈశ్వరరావు అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రైతులందరూ రుణపడి ఉంటారని చెప్పారు.

- వాసంశెట్టి ఈశ్వరరావు, వాకాడ, కరప మండలం



కరప మండలం వాకాడలో సరిహద్దు రాళ్లు పాతుతున్న సిబ్బంది



భూముల హద్దులను సరి చూస్తున్న రెవెన్యూ అధికారులు

- హద్దు చూపి.. రాళ్లు పాతుతున్న అధికారులు
- వేగంగా సాగుతున్న వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష సర్వే
- మూడు దశల్లో పకడ్బందీగా ప్రక్రియ

కాకినాడ సిటీ: జిల్లాలో వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు - భూరక్ష ద్వారా భూముల రీ–సర్వే ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. అటు భూ సర్వే, ఇటు హద్దు రాళ్ల ఏర్పాటు, భూహక్కు పత్రాల పంపిణీ.. ఇలా అన్ని పనులూ చకచకా సాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న భూ సర్వే విజయవంతానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, ఇతర అధికారులు, సిబ్బంది కృషి చేస్తున్నారు. ఇప్పటి వరకూ అక్కడక్కడ రికార్డులకు చెదలు పట్టడంతో ఎవరి భూములు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి ఉండేది. అడ్డూ అదుపూ లేని అక్రమాలు ఓవైపు, న్యాయపరమైన చిక్కులు మరోవైపు ఉండేవి. వీటన్నింటికీ పరిష్కారం చూపి, రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేయాలనే ప్రభుత్వ సుసంకల్పం నెరవేరుతోంది. దీంతో దశాబ్దాల భూ చిక్కుముడులు ఒక్కొక్కటిగా వీడుతున్నాయి.

హద్దు రాళ్ల ఏర్పాటు

జిల్లాలో ల్యాండ్ అండ్ సర్వే, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో భూ సర్వే చేపట్టారు. మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 21 మండలాలు, 413 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటిలో ఈనాం, పట్టణాల్లో విలీనమైన గ్రామాలు పోనూ 285 గ్రామాల పరిధిలో 6,82,034.11 ఎకరాల భూ విస్తీర్ణాన్ని డ్రోన్ల ద్వారా సర్వే చేశారు. డ్రోన్లు, 133 రోవర్లను ఈ పనికి యోగిస్తున్నారు. మూడు దశల్లో కలిపి 285 గ్రామాల్లో భూముల కచ్చితత్వం (గ్రౌండ్ ట్రూతింగ్) పూర్తి చేశారు. ఇప్పటి వరకూ 1,33,873 మందికి రీ సర్వే తర్వాత కొత్త ఖాతాలు జారీ చేసి, ప్రత్యేక క్యూఆర్ కోడ్ కలిగిన శాశ్వత భూ హక్కు పత్రాలు, మ్యాప్‌లు అందజేశారు. మిగిలిన గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి కావడంతో ఈ నెలాఖరుకు భూ హక్కు పత్రాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. 471 మంది విలేజ్ సర్వేయర్లు, 620 మంది వీఆర్‌ఓలు రీ సర్వే ప్రక్రియలో పాలుపంచుకుంటున్నారు. మూడు దశల్లో 2,98,813 హద్దు రాళ్లను పాతి శాశ్వత సరిహద్దులు నిర్ణయించారు.

జిల్లాలో రీ సర్వే ఇలా..

రెవెన్యూ గ్రామాలు	413
సర్వే పూర్తయిన గ్రామాలు	402
భూ విస్తీర్ణం (ఎకరాల్లో)	6,82,034.11
అర్థోరెక్టిఫైడ్ ఇమేజెస్ పూర్తయిన గ్రామాలు	350
భూముల కచ్చితత్వం పూర్తయిన గ్రామాలు	285
జారీ చేసిన శాశ్వత హక్కు పత్రాలు	1,33,873
పొలాల్లో పాతిన హద్దు రాళ్ల సంఖ్య	2,98,813

'భూహక్కు-భూరక్ష'తో మేలు



కరప మండలం వాకాడ గ్రామానికి చెందిన ఈ రైతు పేరు మేడిశెట్టి రాంబాబు. ఈయనకు 4.50 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సరైన హద్దులు, మ్యాప్‌లు లేవు. అధికారులు రీ–సర్వే ద్వారా పొలాన్ని కొలిచి, హద్దు రాళ్లు వేయడంతో పాటు శాశ్వత హక్కు పత్రాలు, మ్యాప్‌లు అందజేశారు. ఏ ఆఫీస్ మెట్లూ ఎక్కకుండానే రూపాయి ఖర్చు చేయకుండానే ఈ రైతు సమస్య తీరింది. రీ సర్వేతో భవిష్యత్‌లో ఎటువంటి భూ సమస్యలూ తలెత్తవని, రాంబాబు ఆనందం వ్యక్తం చేశారు.

- మేడిశెట్టి రాంబాబు, రైతు, వాకాడ, కరపమండలం

కచ్చితత్వంతో సాగుతోంది



జిల్లాలో రీ సర్వే వేగంగా, కచ్చితత్వంతో సాగుతోంది. ఈ నెలాఖరుకు పూర్తి చేసేలా రెవెన్యూ సిబ్బంది పని చేస్తున్నారు. ఇప్పటి వరకూ 1,33,873 మందికి శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేశాం. 2,98,813 హద్దురాళ్లను రైతు పొలాల్లో నాటే కార్యక్రమం పూర్తయింది. చరిత్రలో నిలిచిపోయే ఈ కార్యక్రమంలో భాగస్వాములం కావడం సంతోషంగా ఉంది.

- కృతికా శుక్లా, జిల్లా కలెక్టర్, కాకినాడ

డాక్టర్ యనమదలకు మధునాపంతుల ప్రతిభా పురస్కారం

14న పల్లిపాలెం ఆంధ్రీ కుటీరంలో ప్రదానం



డాక్టర్ మురళీకృష్ణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ప్రజా వైద్యుడిగా పేరొందిన కాకినాడకు చెందిన వైఎస్సార్ సీపీ వైద్య విభాగం ప్రాంతీయ సమన్వయ కర్త డాక్టర్ యనమదల మురళీకృష్ణ మధునాపంతుల ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయుర్వేద వైద్యునిగా, కవిగా, పండితునిగా ఖ్యాతిగాంచిన కాజులూరు మండలం పల్లిపాలెం గ్రామానికి చెందిన మధునాపంతుల సూరయ్యశాస్త్రి శతజయంత్యుత్సవాల సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులకు ఈ పురస్కారాలు ప్రకటించారు. ఈ నెల 14న పల్లిపాలెం మధునాపంతుల కామరాజు సాంస్కృతిక ప్రాంగణంలో నిర్వహించే కార్యక్రమంలో డాక్టర్ యనమదల మురళీకృష్ణను ప్రతిభా పురస్కారంతో సత్కరించనున్నారు. కోవిడ్–19, దీర్ఘకాలిక వ్యాధులపై సాధికారమైన వైద్య విజ్ఞానాన్ని ప్రజలకు విస్తృతంగా అందుబాటులోకి తీసుకుని రావడం, వీటిపై ప్రజల్లో భయాలను తొలగించి, భరోసా కల్పించినందుకు ఆయనను ఈ పురస్కారంతో గౌరవిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. 2000లో డాక్టర్ యరళీకృష్ణ ప్రచురించిన 'ఎయిడ్స్' పుస్తకం 8 వేల ప్రతులు పదేళ్లలో తెలుగు ప్రజలకు చేరాయి. 1998–2000 మధ్య ఎయిడ్స్‌పై ఆయన విస్తృత అవగాహన కల్పించారు. ఇటీవల ప్రపంచాన్ని కుదిపేసిన కరోనా మహమ్మారిపై ప్రజలకు ఎప్పటికప్పుడు సామాజిక మాధ్యమాల ద్వారా డాక్టర్ యనమదల ఆధునిక వైద్య విజ్ఞానాన్ని అందించారు. ఆయన ఇచ్చిన సలహాలు, సూచనలు ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఎంతో ఉపకరించాయి. 2022 జనవరిలో ఆయన ప్రచురించిన 'కోవిడ్, ఎయిడ్స్ నేను' ఆత్మకథాత్మక వైద్య విజ్ఞాన గ్రంథం తెలుగు నాట అత్యంత ప్రజాదరణ పొందింది. వీటిన్నింటినీ పరిగణనలోకి తీసుకుని మురళీకృష్ణను ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేశారు.

హార్బర్ నిర్మాణం వేగవంతం చేయాలి

- తీరప్రాంత శాశ్వత రక్షణకు చర్యలు
- సాగర పరిక్రమలో కేంద్ర మంత్రి రూపాలా

కొత్తపల్లి: అమీనాబాదులో మేజర్ హార్బర్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కేంద్ర మత్స్య, పశు సంవర్ధక, పాడి పరిశ్రమల శాఖ మంత్రి పరుషోత్తం రూపాలా అన్నారు. పదో విడత సాగర పరిక్రమ కార్యక్రమంలో భాగంగా అమీనాబాదు హార్బర్‌లో గురువారం ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొన్నారు. మత్స్యకారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హార్బర్ నిర్మాణ పనులను పరిశీలించారు. కిసాన్ క్రెడిట్ కార్డులు పంపిణీ చేశారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద సబ్సిడీపై అందించిన వాహనాన్ని లబ్ధిదారుకు అందజేశారు. ఉప్పాడ నుంచి కాకినాడ, ఉప్పాడ, కోనపాపపేట తీర ప్రాంతాలు కోతకు గురవుతున్నాయని, ఇక్కడ శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని, ప్రమాదవశాత్తూ సముద్రంలో మునిగిపోయిన, దెబ్బ తిన్న బోట్లకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, వేటకు వెళ్లే మెకనైజ్డ్ బోట్లకు ఇస్తున్న 3 వేల లీటర్ల ఆయిల్ సబ్సిడీని సంప్రదాయ బోట్లకు కూడా వర్తింపజేయాలని స్థానిక సర్పంచ్ నక్కా మణికంఠబాబు కోరారు. బోట్లు, ఇంజన్లు, వలలు సబ్సిడీపై ఇవ్వాలని, మత్స్యకార మహిళలకు సబ్సిడీపై ఐస్ బాక్సులు, 50 నుంచి 70 శాతం రుణాలు ఇవ్వాలని మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు కోరారు. మంత్రి రూపాలా మాట్లాడుతూ, ఈ హార్బర్ నిర్మాణంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. బీచ్ రోడ్డు, తీర ప్రాంతం కోతను స్వయంగా పరిశీలించామని, దీని నివారణకు శాశ్వత చర్యలు చేపట్టే అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళతామని, ఇతర సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. రాష్ట్ర మత్స్య, పశు, పాడి సంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ, అమీనాబాదు హార్బర్ నిర్మాణాన్ని 6 నెలల్లో పూర్తి చేసి, మత్స్యకారుల దశాబ్దాల కల సాకారం చేస్తామని అన్నారు. ఈ హార్బర్ నిర్మాణంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని చెప్పారు. కార్యక్రమంలో కేంద్ర మత్స్య శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్, కాకినాడ ఎంపీ వంగా గీత, పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కేంద్ర మత్స్య శాఖ జేడీ నీతూకుమారి, మత్స్యశాఖ జేడీ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ పాల్గొన్నారు.



హార్బర్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాలా, రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీ గీత తదితరులు

ఇంత పింఛన్.. దేశంలోనే ప్రథమం

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కొత్తూరులో లబ్ధిదారులకు కొత్త పెన్షన్ల పంపిణీ

తుని రూరల్: దేశంలో మరెక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే రూ.3 వేల చొప్పున సామాజిక భద్రతా పింఛన్లు ఇస్తున్న ప్రభుత్వం తమదేనని రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం కొత్తూరులో లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన రూ.3 వేల పింఛన్లను గురువారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాడు ప్రతిపక్ష నాయకుడిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి అయిన తర్వాత పింఛన్ మొత్తాన్ని దశల వారీగా రూ.3 వేలకు పెంచారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రూ.వెయ్యి ఇచ్చినప్పటికీ ఎన్టీఆర్ విగ్రహాలకు, ఇతరేతర కార్యక్రమాలకు పింఛన్‌దారుల నుంచి టీడీపీ నాయకులు లంచాలు వసూలు చేశారని గుర్తు చేశారు. అర్హతే ప్రమాణికంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తోందని చెప్పారు. అప్పటి ప్రభుత్వ పనితీరుకు, ఇప్పుడున్న ప్రభుత్వం పనితనాన్ని ప్రతి ఒక్కరూ పోల్చి చూడాలని కోరారు. జిల్లాలో ఎక్కడా ఇవ్వని విధంగా తుని నియోజకవర్గంలో 38,600 మందికి పింఛన్లు ఇస్తున్నామని తెలిపారు. కొత్తగా మరో 528 పింఛన్లు మంజూరయ్యాయన్నారు. ఆఫీసుల చుట్టూ తిరగకుండానే లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. ఉన్న ఊళ్లోనే గ్రామ సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించి పరిపాలనను సులభతరం చేశామని అన్నారు.



వృద్ధురాలికి రూ.3 వేల పింఛను అందిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

ద్రోహులను నమ్మి మోసపోకండి

రానున్న ఎన్నికల్లో తడి గుడ్డలతో గొంతులు కోసే నాయకులు వస్తారని, అటువంటి ద్రోహులను నమ్మి మోసపోవద్దని మంత్రి దాడిశెట్టి రాజా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 14 ఏళ్లు పరిపాలించిన చంద్రబాబు నాయుడు ఇప్పుడు అధికారంలోకి వస్తే ఏదో చేస్తానని చెప్పడం మోసపూరితమేనన్నారు. ఎల్లో మీడియా తప్పుడు కథనాలతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందవన్నారు. తెలంగాణలో ఆరోగ్యశ్రీలో రూ.10 లక్షలు మాత్రమే ఇస్తూంటే.. ఏపీ ప్రభుత్వం రూ.25 లక్షల వరకూ ఇస్తోందని చెప్పారు. మంచి చెడులను గుర్తించి వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రంలో 175కి 175 అసెంబ్లీ స్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెరిక కార్పొరేషన్ చైర్‌పర్సన్ పురుషోత్తం గంగాభవాని, ఏఎంసీ చైర్మన్ మాకినీడి బాబు, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్య నాయుడు, డీసీసీబీ డైరెక్టర్ పోలిశెట్టి సోమరాజు, జెడ్పీటీసీ సభ్యురాలు పోతల సూర్యమణి, సర్పంచ్ దుంగల గణపతి రోజారాణి, ఎంపీడీఓ పి.రవికుమార్ పాల్గొన్నారు.

11 జిల్లాల అధికారులకు నేటి నుంచి శిక్షణ

సామర్లకోట: స్థానిక ఈటీసీలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని అధికారులకు శుక్రవారం నుంచి శిక్షణ ఇవ్వనున్నారు. రెండు రోజుల పాటు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ గురువారం తెలిపారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై జెడ్పీ సీఈఓలు, డీపీఓలు, డీఎల్‌పీఓలకు శిక్షణ ఇస్తామన్నారు.

కొక్కొరొకో.. రక్షణ ఇదిగో...

- ఉమ్మడి జిల్లాలో విస్తృతంగా పౌల్ట్రీలు
- చలికాలంలో కోళ్లకు వ్యాధులు సోకే అవకాశం
- యాజమాన్య పద్ధతులు పాటించాలంటున్న అధికారులు




కోడికి వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్యుడు

రాయవరం: పౌల్ట్రీ రంగం రైతులకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. రాష్ట్రంలో జిల్లా కోడిగుడ్ల ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ శీతాకాలంలో కోళ్లకు ఎక్కువగా వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. వీటి గురించి తెలుసుకుని మేలుకోకపోతే నష్టాలు తప్పవని అధికార యంత్రాంగం సూచిస్తుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 200 పౌల్ట్రీలు ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పెరటికోళ్లు 37,94,010 ఉండగా, పౌల్ట్రీల్లో 5.27 లక్షల లేయర్, బాయిలర్ కోళ్లు పెంచుతున్నారు. కోళ్లకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా లేకపోతే నష్టాలు తప్పవని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ కర్నీడి మూర్తి సూచిస్తున్నారు. వ్యాధి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు.

కొక్కెర తెగులు వస్తే..

న్యూకేజిల్ డిసీజ్‌గా పిలిచే 'కొక్కెర' మిగతా వ్యాధులన్నింటి కంటే అత్యంత ప్రమాదకమైంది. ఈ వ్యాధితో ఎక్కువ సంఖ్యలో కోళ్లు చనిపోతాయి. రోగానికి గురైన కోళ్లు ముడుచుకుని ఉండి రెక్కలు వేలాడదీసుకుంటాయి. పక్షవాతం లక్షణాలు కనిపిస్తాయి. మెడ వెనక్కి వాలుతుంది. విరేచనాలు తెలుపు, ఆకుపచ్చ రంగులో అవుతాయి. శ్వాసలో ఇబ్బంది వస్తుంది. సన్నని రక్తపు గడ్డల చుక్కలు గిజార్డు, పెకార్డియంలో కనబడతాయి. దీని నివారణకు మొదటి, నాలుగో వారం, ఆ తర్వాత 6–8 వారాల మధ్య మరోసారి, చివరగా 20వ వారం టీకాలు వేయడంతో చాలా వరకూ కోళ్లను రోగాల నుంచి రక్షించుకోవచ్చు. వ్యాధి సోకిన కోళ్లను మట్టిలో కప్పెట్టాలి లేదా కాల్చివేయాలి. ఈ వ్యాధి లక్షణాలున్న కోడి మాంసం తినరాదు.

మసూచి వ్యాధి సోకితే..

కోళ్లకు వచ్చే అంటువ్యాధుల్లో ముఖ్యమైనది మసూచి (ఫౌల్‌పాక్స్). దీనివల్ల గుడ్ల ఉత్పత్తి గణనీయంగా తగ్గి కోళ్లు చనిపోతాయి. కోళ్ల జుట్టు, తమ్మెలకు కనురెప్పల చుట్టూ పొక్కులు వస్తాయి. అప్పుడప్పుడు కళ్లలో కూడా ఈ పొక్కులు వచ్చి కళ్లు కనబడవు. దీని నివారణకు టీకాలు వేయించడం ఒక్కటే మార్గం. ఇవి 6–7 వారాల వయసులో, తిరిగి 16–17 వారాల మధ్య వేయించాలి.

కొరైజాతో నష్టాలు..

గురక వ్యాధిగా పిలిచే కొరైజా శీతాకాలంలోనే సోకుతుంది. కోడిపిల్లలు సరిగా నీటిని తాగక, మేతను తినక బరువును కోల్పోతాయి. ముక్కు, కళ్ల నుంచి నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఒకసారి ఈ వ్యాధి కోళ్లలోకి ప్రవేశిస్తే అన్ని కోళ్లకు రోగం వస్తూనే ఉంటుంది. పౌల్ట్రీల్లో కోళ్లకు ఈ వ్యాధి వచ్చినప్పుడు కొద్ది రోజులు షెడ్లు ఖాళీగా పెట్టి, బ్లోలాంప్‌తో నేల, గోడలను కాల్చాలి. ఫార్మాలిడిహైడ్‌తో ఫ్యూమిగేషన్ చేయాలి. సున్నం, గమాక్సిన్, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ కలిపి గోడలకు వేయాలి. రోగం సోకిన పిల్లలకు హూస్టసైక్లిన్, ప్లాక్సైడ్ లేదా ఇతర యాంటి బయోటిక్ మందులు విటమిన్‌తో కలిపి వారం రోజులు వాడితే పూర్తిగా నయం అవుతుంది.

జాగ్రత్తలు తప్పనిసరి



కోళ్లకు వేసే టీకా మందులు ఎప్పుడూ ఐస్ లేదా ఫ్రిజ్‌లో ఉంచాలి. ఇతర రోగాలున్నప్పుడు టీకాలు వేయరాదు. కోళ్లు అస్వస్థతకు గురైతే టీకాలు వేయించరాదు. ఉదయం, సాయంత్రం వేళల్లోనే టీకాలు వేయడం మంచిది. టీకా మందు సీసా నుంచి తీసి కలిపిన తర్వాత రెండు గంటల లోపే వాడాలి.

–డాక్టర్ కర్నీడి మూర్తి, పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్

బ్యాక్టీరియాతో వ్యాధులు

బ్యాక్టీరియా కారణంగా కోడిపిల్లలు ఎక్కువగా సాల్మొనెల్లా పుల్లోరం వ్యాధికి గురవుతాయి. ఈ వ్యాధి తల్లి నుంచి పిల్లలకు గుడ్ల ద్వారా కూడా సంక్రమిస్తుంది. రోగం సోకిన పిల్లలు గుమిగూడడం, భారంగా శ్వాస తీసుకోవడం, మెడ వాల్చడం గమనించవచ్చు. దీని నివారణకు యాంటి బయోటిక్ మందులు వాడాలి.

- ఎస్సరీషియా కొలై వ్యాధి బాయిలర్ కోళ్లలో తీవ్రంగా వస్తుంది. బ్యాక్టీరియాతో వచ్చే ఈ వ్యాధితో కోళ్లలో బరువు సరిగ్గా రాదు. నివారణకు యాంటి బయోటిక్ మందులు మేత, నీటితో ఇవ్వాలి. దీంతో పాటు పొటాషియం పర్మాంగనేట్ ద్రావణం మందును కోళ్లకు పట్టించాలి.

రక్తపారుడు రోగం

ప్రోటోజోవా వల్ల సోకే ఈ వ్యాధితో తరచూ బాయిలర్ కోళ్ల పరిశ్రమ తీవ్ర నష్టానికి గురవుతుంది. మేతలో కాక్సిడియోస్టాట్స్ సరైన మోతాదుల్లో వాడనప్పుడు ఈ వ్యాధి వస్తుంది. 11వ రోజు నుంచి 8వ వారం లోగా ఎప్పుడైనా, ఈ వ్యాధి బ్రాయిలర్ పిల్లలకు సోకవచ్చు. రోగం సోకిన కోడిపిల్లల్లో నోటి ద్వారా వాంతులు అవుతాయి. మేత, నీరు తక్కువగా తీసుకుంటాయి. మేత, నీటిలో కాక్సిడియోస్టాట్ మందులు తగు మోతాదులో వాడితే రోగాన్ని నివారించవచ్చు.

చతుర్వేద మహాయాగం ప్రారంభం


చతుర్వేద మహాయాగంలో పాల్గొన్న చైతన్యరాజు దంపతులు

రాజానగరం: ప్రపంచ శాంతి, లోక కల్యాణార్థం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో స్థానిక గైట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించే చతుర్వేద మహాయాగం, శ్రీవారి వైభవోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), అమలాపురం కిమ్స్ ఆసుపత్రి ఎండీ కె.రవికిరణ్‌వర్మ, గైట్ కళాశాల ఎండీ కె.శశికిరణ్‌వర్మ, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజు దంపతులచే వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ సంప్రదాయబద్ధంగా వేడుకలు ప్రారంభమయ్యాయి. శ్రీవారి వైభవోత్సవంలో తిరుమలేశుని నమూనా విగ్రహాన్ని ఏర్పాటు చేసి సుప్రభాతం, తోమాల సేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్ర నామార్చన, నివేదన, సర్వదర్శనం, తిరుప్పావై సేవతో శ్రీనివాసుని కల్యాణోత్సవాన్ని ఆగమ పండితులు దీవి బాలాజీ రంగాచార్యుల ఆధ్వర్యంలో కనుల పండుగగా నిర్వహించారు. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి సర్వదర్శనం, శుద్ధి ఏకాంత సేవలు జరిగాయి. అన్నవరం, ద్వారకాతిరుమల నుంచి వచ్చిన రథాల్లో సత్యనారాయణ స్వామి, శ్రీవేంకటేశ్వరుడు, అమ్మ వార్లకు అర్చకులు పూజలు చేశారు. ఇదే ప్రాంగణంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. ఈ వేడుకలతో గైట్ కళాశాల ప్రాంగణం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ బైర్రాజు ప్రసాదరాజు, మాజీ ఎమ్మెల్సీ ఈలి నాని తదితరులు పాల్గొన్నారు.

అహంకారమే నాశనానికి తొలిమెట్టు

మహా సహస్రావధాని గరికిపాటి


ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న గరికిపాటి నరసింహారావు

అనపర్తి: అహంకారమే మనిషి నాశనానికి తొలి మెట్టు అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని మహా సహస్రావధాని పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు అన్నారు. అనపర్తి శ్రీశారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో 25వ శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి మహాభారతంలో కుంతీదేవి పాత్రను విశ్లేషిస్తూ ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరికలే దుఃఖానికి మూలమన్నారు. నిశ్చలమైన మనసుతో మోక్ష సిద్ధి కలుగుతుందన్నారు. మహా భారతంలో కుంతీదేవి త్యాగనిరతిని వివరించడంతో పాటు తనదైన శైలిలో ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తూ ఆహుతులను అలరించారు. రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, నేత్ర వైద్యుడు తేతలి సత్యనారాయణరెడ్డి, జిల్లా పరిషత్ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, ఎన్‌సీఆర్ భాస్కరరెడ్డి, అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ టి.రామగుర్రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రాముని ఆశీర్వచనంతో జటాయువుకు పుణ్యగతులు

సద్గురు సామవేదం షణ్ముఖశర్మ



అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దశరథునికి పట్టని భాగ్యం జటాయువుకు దక్కిందని, రామచంద్రుడు జటాయువుకు అంతిమ సంస్కారాలు చేసినట్టు సద్గురు సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. రాజమహేంద్రవరంలోని హిందూ సమాజంలో ఆయన 23వ రోజు ప్రవచనం గురువారం కొనసాగింది. 'నీకు పునరావృత్తి రహిత శాశ్వత ఉత్తమ లోకాలు లభిస్తాయని రాముడు పక్షి రాజును ఆశీర్వదించాడని సామవేదం సభికులకు వివరించారు. మార్గ మధ్యంలో ఎదురైన కబంధుడు అనే రాక్షసునికి దహన సంస్కారాలు జరిపి, ఆ రాక్షసునికి శాప నివృత్తి చేశాడని, తపస్సు చేస్తున్న శబరికి రామ దర్శనం కావడంతో ఆమె తపము ఫలించి ఉత్తమ లోకాలకు చేరుకుందని ఆయన పేర్కొన్నారు. శబరి ఆటవిక జాతికి చెందినదని చెప్పడానికి ఆధారాలు లేవని, మహా తపస్విని అయిన ఆమె రామలక్ష్మణులకు తన ఉచ్ఛిష్టాన్ని (ఎంగిలి చేసిన పదార్థం) నివేదించిందనడం సరికాదని, ఉచ్ఛిష్టం దోషం కనుకనే మంచి నీరు తాగేటప్పుడు సైతం మన ప్రాచీనులు పాత్రను ఎత్తి పట్టుకుని, నీటిని తాగేవారని సామవేదం వివరించారు. జటాయువు రామునితో ఆఖరి క్షణాల్లో మాట్లాడుతూ రావణుడు విందు అనే ముహూర్తంలో సీతని అపహరించాడని, ఇది వాడికి ప్రాణహాని కలిగించే ముహూర్తమని చెప్పాడన్నారు. ఈ ముహూర్తంలో ఏదైనా పోగొట్టుకున్నా దానిని యజమాని తప్పక పొందుతాడని జటాయువు రామునికి వివరించినట్టు షణ్ముఖశర్మ పేర్కొన్నారు. దీనిని బట్టి జటాయువుకు కూడా జ్యోతిషంలో ప్రతిభ ఉందని మనం భావించవచ్చని ఆయన అన్నారు. ఈ క్రమంలో ఆయన అరణ్యకాండం పూర్తి చేసి కిష్కింధ కాండను ప్రారంభించారు. హనుమతో రామలక్ష్మణుల తొలి సమావేశంలోనే రాముడు హనుమ బుద్ధి కుశలతను గుర్తించాడన్నారు. రాముని అభిమానాన్ని చూరగొనే వ్యక్తికి ఉండాల్సిన లక్షణం ధర్మాచరణ అని హనుమ గుర్తించాడని, రామ హనుమల తొలి సమావేశం కిష్కింధ కాండలో కీలక ఘట్టమని సామవేదం సభికులకు వివరించారు.

లక్ష్మీనృసింహుని హుండీల ఆదాయం లెక్కింపు


అంతర్వేది ఆలయంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో హుండీల ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కించారు. మొత్తం 98 రోజులకు గాను భక్తుల నుంచి విరాళాలుగా రూ.47,00,060 ఆదాయం సమకూరింది. ఈ లెక్కింపును జిల్లా దేవదాయ శాఖ అధికారి కేఎన్‌డీవీ ప్రసాద్, తనిఖీదారుడు జె.రామలింగేశ్వరరావు సమక్షంలో సిబ్బంది నిర్వహించారు. కాగా మొత్తం ఆదాయంలో ప్రధాన హుండీ, గుర్రాలక్క అమ్మవారి గుడి హుండీల ద్వారా రూ.46,08,255, అన్నదాన హుండీ ద్వారా రూ.91,805 ఆదాయం వచ్చినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వివరించారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ సభ్యుడు బైరా నాగరాజు, అర్చకులు, స్వామివారి సేవకులు పాల్గొన్నారు.

పంట కాలువలోకి కారు బోల్తా


బక్కివారిపేట వద్ద పంట కాలువలో బోల్తా పడిన కారు

కాట్రేనికోన: మండలంలోని బక్కివారిపేట సమీపంలో ఓ కారు అదుపుతప్పి పంట కాలువలో పడిపోయింది. స్థానికుల కథనం ప్రకారం. చెయ్యేరుకు చెందిన ఇద్దరు యువకులు మొండిపోర చెరువుల వద్దకు వెళ్లి ఇంటికి వస్తున్న సమయంలో బక్కివారిపేట వద్ద ప్రమాదం జరిగింది. దారి తప్పి ముందుకు వెళ్లిన కారును వెంకమ్మ చెరువు వైపు వెనకకు తిప్పుతున్న సమయంలో కారు బోల్తా పడింది. వెంటనే స్థానికులు కారు తలుపులు తెరిచి యువకులను రక్షించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. కారును జేసీబీ సాయంతో బయటకు తీశారు.

20 ఎకరాల చెరకు తోట దగ్ధం

రూ.8 లక్షల ఆస్తినష్టం


చెరకు తోటలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

గోపాలపురం: మండలంలోని తొక్కిరెడ్డిగూడెంలో సుమారు 20 ఎకరాల చెరకు తోట గురువారం దగ్ధమైంది. జంగారెడ్డిగూడెం అగ్నిమాపక అధికారి బి.జహంగీర్ కథనం ప్రకారం.. తొక్కిరెడ్డిగూడెంలో గోపాలపురం గ్రామానికి చెందిన బోళ్ల భాస్కరరావుకు చెందిన చెరకు తోట ఉంది. ఈ తోటలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తెగిపడడంతో నిప్పురవ్వలు చెలరేగాయి. చెరకు తోట కింది భాగంలో ఎండిన ఆకుల ఉండటంతో ఈదురు గాలులకు మంటలు రేగి సుమారు 20 ఎకరాల్లోని తోట పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ.8 లక్షల నష్టం జరిగిందని అధికారులు అంచనా వేశారు. చుట్టుపక్కల రైతులు వచ్చి మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతు భాస్కరరావు తెలిపారు.